నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
21 ఆగస్టు 2024
పేజీలు 8

**నాగాస్త్ర-1**

దేశీయంగా తొలిసారి అభివృద్ధి చేసిన సూసైడ్ (ఆత్మాహుతి) డ్రోన్ 'నాగాస్త్ర-1'ను జూన్ 13న ఆర్మీకి అందజేశారు. 9 కిలోల బరువుండే ఈ డ్రోన్‌ను మనిషి మోసుకెళ్లేలా రూపొందించారు. కామికేజ్ మోడ్ (శత్రు స్థావరాలు, లక్ష్యాలపై డ్రోన్‌ను సొంతంగా కూల్చివేయడం)లో పని చేయడం ద్వారా ఇది శత్రువుల ముప్పును సమర్థంగా నిలువరించగలుగుతుంది. ఇది కిలో పేలుడు పదార్థాలను మోసుకెళ్తుంది. దీని పరిధి 15 నుంచి 30 కిలోమీటర్లు. దీన్ని మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ కంపెనీ అభివృద్ధి చేసింది.

# స్వదేశీ ఉద్యమం.. స్వాతంత్ర్యోద్యమానికి కీలకం

**భారత జాతీయోద్యమాన్ని అణచివేసే క్రమంలో బ్రిటిష్ పాలకులు 1905లో బెంగాల్‌ను విభజించారు. దీంతో ఒక్క బెంగాల్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అప్పటివరకు కాంగ్రెస్ మితవాదుల చేతుల్లో ఉన్న జాతీయోద్యమం లో కమాన్య తిలక్, బిపిన్‌చంద్రపాల్, లాలా లజపతిరాయ్ తదితర అతివాదులు కేంద్రంగా ముందుకు సాగింది. బెంగాల్ విభజనకు నిరసనగా దేశమంతటా 'వందేమాతరం' నినాదాలు మార్మోగాయి. స్వదేశీ వస్తు వినియోగం, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయ విద్యాలయాల ఏర్పాటు వంటివి ప్రారంభమయ్యాయి.**



**గ్రూప్-1 ప్రత్యేకం**
**ఇండియన్ హిస్టరీ**

- బ్రిటిష్ వారు భారతదేశంలో తమ అధికారాన్ని నిలుపుకొనేందుకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముస్లిం మతవాదాన్ని ఉపయోగించుకోవాలని అనుకున్నారు. దీనిలో భాగంగా అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ 1905లో బెంగాల్ విభజనను అమలుపరచాడు.
- కర్జన్ సామ్రాజ్యవాదే కాకుండా భారతదేశం పట్ల ఏహ్య భావం ఉన్న వ్యక్తి. ఆయన పాలన కాలంలోనే గర్హనీయమైన కలకత్తా కార్పొరేషన్ చట్టం (1899), అధికార రహస్యాల చట్టం (1902), విశ్వవిద్యాలయాల చట్టం (1904) మొదలైనవి వచ్చాయి. ఈ చట్టాలకు పరాకాష్టగా వచ్చిందే బెంగాల్ విభజన చట్టం.

విభజన కారణం

- బెంగాల్‌లో 7 కోట్ల 80 లక్షల జనాభా ఉండేది. ఇంత జనాభాను ఒక్క అధికార కేంద్రం నుంచి పరిపాలించడం కత్తిమీద సాములాంటి వ్యవహారమే.
- అప్పటికే చాలా ఏళ్లుగా బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలను వేరుచేసి అస్సాంలో కలపాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. అది కర్జన్ పాలనకాలంలో 1903లో ఒక నిర్దిష్ట రూపంలోకి వచ్చింది. 1905, జూలై 19న చట్టంగా మారింది.
- మొత్తం మీద బెంగాల్‌ను.. ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న తూర్పు బెంగాల్, అస్సాం ప్రాంతాలను ఒక రాష్ట్రంగా, హిందువులు అధికంగా ఉన్న పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, బీహార్ ప్రాంతాలను ఒక రాష్ట్రంగా విభజించారు.
- విభజన ఇలా కాకుండా హిందీ ప్రాంతాలను బీహార్ రాష్ట్రంగా, బెంగాలీ ప్రాంతాన్ని మతానికి అతీతంగా ఒక రాష్ట్రంగా, అస్సాం, ఒరిస్సాలను ప్రత్యేక రాష్ట్రాలుగా చేస్తే కర్జన్ ప్రణాళిక భారతీయుల ఆమోదాన్ని పొంది ఉండేది. అంతేకాకుండా కలకత్తాకు ప్రతిగా తూర్పు బెంగాల్‌లో ఢాకాను మరో రాజకీయ కేంద్రంగా నిలబెట్టాలన్నది బ్రిటిష్ వారి ఆలోచన.
- బెంగాల్ విభజన చట్టం 1905, అక్టోబర్ 16 నుంచి అమల్లోకి వచ్చింది.

ప్రజల ప్రతిస్పందన

- బెంగాల్ విభజనకు 1903 నుంచే రంగం సిద్ధం కావడంతో ప్రభుత్వ నిర్ణయం మీద ప్రజలు ఎన్నో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విజ్ఞప్తులు ఇచ్చారు. బెంగాలీ, హితబాది, సంజీబని తదితర పత్రికల్లో పెద్ద ఎత్తున చర్చోపచర్చలు జరిగాయి.
- 1905, జూలై 19న బెంగాల్‌ను విభజిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. ప్రజలు నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. దాంతో ఆగస్టు 7న ప్రభుత్వ చర్యకు నిరసనగా విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చారు. అలా స్వదేశీ ఉద్యమం మొదలైంది. అక్కడినుంచి ఓ మూడు నాలుగేళ్ల పాటు దేశమంతటా ఎక్కడ చూసినా స్వదేశీ ప్రాధాన్యం గురించే చర్చించుకున్నారు.
- బెంగాల్ విభజన అమల్లోకి వచ్చిన అక్టోబర్ 16న బెంగాలీలు ఆ రోజంతా పని మానేశారు. ఇళ్లలో పొయ్యి వెలిగించలేదు. అక్కడితో ఆగకుండా 'వందేమాతరం' నినాదంతో వీధుల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. గంగానదిలో స్నానం చేసి, మట్టిని నొసట ధరించి ఒకరికొకరు వందేమాతరం నినాదంతో పలకరించుకొన్నారు. అలా స్వదేశీ ఉద్యమానికి వందేమాతర ఉద్యమం అనే పేరు కూడా నిలిచిపోయింది.
- రవీంద్రనాథ్ ఠాగూర్, అరబిందో ఘోష్ తదితరులు విభజన వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. బెంగాలీల్లో స్ఫూర్తిని రగిలించేందుకు ఠాగూర్ 'అమర్ సోనార్ బంగ్లా (మా బంగారు బంగ్లా)' గీతాన్ని రచించారు. హిందువులే కాదు అబ్దుల్ రసూల్ లాంటి ముస్లింలు కూడా బెంగాల్ విభజనను నిరసించారు. అలా స్వదేశీ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారిపోయింది. రాత్రికి రాత్రే భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు వ్యాపించింది.
- మహారాష్ట్రలో లోకమాన్య తిలక్, పంజాబ్‌లో లాలా లజపతిరాయ్, మద్రాస్‌లో చిదంబరం పిళ్లై, ఢిల్లీలో సయ్యద్ హైదర్ రజా మొదలైన వారు ఉద్యమానికి తమ మద్దతు తెలిపారు. అలా స్వదేశీ ఉద్యమం జాతీయ లక్షణాన్ని సంతరించుకొంది. దీనికి మితవాదులు కూడా మద్దతు తెలిపారు. గోపాలకృష్ణ గోఖలే ఆ ఏడాది జరిగిన కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వాడకాన్ని సమర్థించాడు.

మితవాదులు– అతివాదుల మధ్య విభేదాలు

- అయితే స్వదేశీ ఉద్యమాన్ని దేశమంతటికీ విస్తరించాలని అతివాదులు వాదించగా, దాన్ని ఒక్క బెంగాల్‌కే పరిమితం చేయాలని మితవాదులు పట్టుబట్టారు. దాంతో కాంగ్రెస్‌లో విభేదాలు ముందుకువచ్చాయి. మితవాదులు విభజనను రద్దు చేస్తే సరిపోతుందంటే, అతివాదులేమో దీన్ని స్వరాజ్య సాధనకు పోరాటంగా మలచుకోవాలని భావించడం కూడా విభేదాలకు కారణంగా నిలిచింది.
- ఇదంతా స్వదేశీ ఉద్యమానికి ప్రజల్లో మద్దతును పెంచింది. దాంతో 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో స్వదేశీ, బహిష్కరణ, జాతీయ విద్య, స్వరాజ్య గురించి మొత్తం నాలుగు తీర్మానాలను ఆమోదించారు. అంతేకాదు ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన దాదాభాయ్ నౌరోజీ కాంగ్రెస్ అంతిమ లక్ష్యం కెనడా తదితర దేశాల మాదిరిగా భారతదేశానికి కూడా 'స్వరాజ్యం' ఇవ్వాలని ప్రకటించాడు. ఇది అప్పటికి అత్యంత ప్రభావశీలమైన ప్రకటన.
- అతివాదులు కూడా ఉద్యమంలో ప్రముఖంగా పాల్గొని దాన్ని విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగంతో పాటు పాఠశాలల బహిష్కరణ, న్యాయస్థానాల బహిష్కరణ, బిరుదులు వెనక్కి ఇచ్చేయడం, ప్రభుత్వ విధులను బహిష్కరించడం మొదలైనవాటికి విస్తరించారు.
- బెంగాల్‌లో ఉద్యమ నిర్వహణకు స్థానికంగా ఎన్నో సమితులు పుట్టుకొచ్చాయి. వాటిలో అశ్వనీకుమార్ దత్త నేతృత్వంలోని బరిసాల్ సమితి ఒకటి. ఈ సమితులు ఉద్యమాన్ని ప్రజలకు మరింత చేరువ చేశాయి.
- ఉద్యమం కేవలం రాజకీయపరమైందిగానే మిగిలిపోలేదు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆత్మశక్తిని ప్రబోధించాడు. స్వయంగా కలకత్తాలో ఒక స్వదేశీ వస్తు కేంద్రం ప్రారంభించాడు. జగదీశ్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రరాయ్ తదితరులు విజ్ఞానశాస్త్రంలో భారతీయులు పాశ్చాత్యులకు ఏమాత్రం తీసిపోరని నిరూపించారు. నందలాల్ బోస్, అబనీంద్రనాథ్ ఠాగూర్ భారతీయ చిత్రకళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చి పెట్టారు.

**క్షీణించిన ఉద్యమం**

- ఉద్యమం ఉధృతంగా సాగుతుండటంతో పత్రికా స్వేచ్ఛను రద్దు చేయడం, తిలక్, లజపతి రాయ్, అరబిందో, అజిత్ సింగ్, చిదంబరం పిళ్లై, హరిసర్వోత్తమ రావు తదితర నాయకులకు కారాగార శిక్షలు విధించడం, అశ్వనీకుమార్ దత్త, కృష్ణకుమార్ మిత్ర మొదలైనవారికి దేశాంతర శిక్షలు విధించడం, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను కఠినంగా శిక్షించడం మొదలైన ప్రభుత్వ చర్యల వల్ల 1908 నాటికి ఉద్యమ తీవ్రత తగ్గుముఖం పట్టింది. అలా ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది.
- మరోవైపు 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశం తర్వాత మితవాదులకు, ప్రభుత్వానికి మధ్య రాజ్యాంగ సంస్కరణల గురించి చర్చలు జరిగాయి. ఇంతలో 1907లో సూరత్ సమావేశంలో కాంగ్రెస్ అతివాదులు, మితవాదులుగా విడిపోయింది. మితవాదులు ప్రభుత్వానికి సహకరించారు. అతివాద నాయకులు జైళ్లకు వెళ్లడంతో ఉద్యమానికి నాయకత్వం వహించేవాళ్లు లేకపోయారు.

**ముస్లిం లీగ్ ఏర్పాటు**

- ఇక బ్రిటిష్ ప్రభుత్వం ముస్లింలకు చట్టసభల్లో ప్రత్యేక ప్రాతినిధ్యం ఇస్తామనని ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే 1906, డిసెంబర్ 30న ఇండియన్ ముస్లిం లీగ్ ఏర్పాటయ్యింది. దీనికి నాయకుడు ఢాకా నవాబు సలీముల్లా ఖాన్. అలా స్వదేశీ ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతంలోనే ముస్లిం లీగ్ ఏర్పాటు కావడంతో ఉద్యమం బలహీనపడింది.

**ప్రాధాన్యం**

- స్వదేశీ ఉద్యమంలో భాగంగా ప్రజలను ప్రభావితం చేయగలిగే నివారక ప్రతిఘటన (పాసివ్ రెసిస్టెన్స్), బహిష్కరణ మొదలైన పద్ధతులను జాతీయ నాయకులు ముందుకు తీసుకొచ్చారు. ఇవి తర్వాత కాలంలో గాంధీజీకి ఆయుధాలుగా ఉపకరించాయి. ఉద్యమంలో కార్మికులు కూడా పాల్గొన్నారు. జాతీయ విద్య ప్రాధాన్యాన్ని చాటిచెప్పింది. తర్వాతి తరం విప్లవవాదులు జాతీయ కళాశాలల నుంచే పుట్టుకొచ్చారు.
- ఆర్థిక కోణంలో చూస్తే.. విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా నూలు, ఉప్పు, సిగరెట్లు, బూట్లు వంటి బ్రిటిష్ ఉత్పత్తుల దిగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి. స్వదేశీ వస్తు వినియోగంలో భాగంగా దేశీయ చేనేతలు, పట్టువస్త్రాల ఉత్పత్తి ఇతర హస్తకళలకు గిరాకీ పెరిగింది.
- అంతేకాదు స్వదేశీ పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకువచ్చారు. స్వదేశీ ఉద్యమం ముమ్మరంగా జరుగుతున్న సందర్భంలోనే 1907లో జంషెడ్‌పూర్‌లో టాటా ఉక్కు కర్మాగారం నిర్మాణమైంది. లాలా లజపతిరాయ్ పంజాబ్ నేషనల్ బ్యాంకును స్థాపించారు. చిదంబరం పిళ్లై ఆంగ్లేయులకు పోటీగా 'స్వదేశీ స్టీం నేవిగేషన్ కంపెనీ'ని స్థాపించారు. ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ 'బెంగాల్ కెమికల్స్ ఫ్యాక్టరీ లిమిటెడ్'ను స్థాపించారు.
- వీటన్నిటికి మించి స్వదేశీ ఉద్యమం వల్లే బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులను ముఖ్యంగా మితవాదులను బుజ్జగించేందుకు 1909 మార్లే–మింటో సంస్కరణలు చేపట్టింది.
- స్వదేశీ ఉద్యమ నాయకులను జైళ్లకు తరలించడంతో దేశంలో విప్లవాత్మక మార్గాన్ని ఎంచుకొన్న యువకులు సాహస కృత్యాలకు పాల్పడటం కనిపిస్తుంది. మితవాద రాజకీయాల నుంచి దేశానికి కొత్త తరహా పోరాట వ్యూహాలను నేర్పించి స్వదేశీ ఉద్యమం దేశంలో స్వాతంత్ర్యోద్యమం మరింత ముందుకు వెళ్లేందుకు దోహదం చేసింది.

## బంకించంద్ర చటోపాధ్యాయ

- భారతదేశ జాతీయ గేయం వందేమాతరం రచయితగా ఖ్యాతికెక్కిన బంకించంద్ర చటర్జీ బెంగాల్‌లోని నైహటిలో 1838, జూన్ 27న జన్మించారు. కలకత్తా యూనివర్సిటీ నుంచి డిగ్రీ అందుకొన్న మొదటి ఇద్దరిలో బంకించంద్ర ఒకరు. ఆయన తన ఇరవయ్యో ఏట ఉప కలెక్టర్‌గా బ్రిటిష్ ప్రభుత్వంలో ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టి 1891లో పదవీ విరమణ పొందే వరకు అందులో కొనసాగారు.
- బంకించంద్ర ఉప కలెక్టర్‌గా కంటే గొప్ప రచయితగా, పాత్రికేయుడిగా, కవిగా సుప్రసిద్ధుడు. ఇంగ్లిష్‌లో రాసిన 'రాజమోహన్స్ వైఫ్' అనే నవల ఆయన తొలి రచన. ఆ తర్వాత ఆయన బెంగాలీ రచనల వైపు దృష్టి సారించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, సీతారామ్ మొదలైన నవలలు రాశారు.
- బంకించంద్ర పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది 'వందేమాతరం' గేయమే. జాతీయోద్యమ నినాదంగా పని చేసిన ఈ గేయం ఆయన రాసిన 'ఆనంద్‌మఠ్' నవలలోనిది. పద్దెనిమిదో శతాబ్దం మధ్య కాలంలో జరిగిన సన్యాసుల తిరుగుబాటు ఇతివృత్తంగా ఈ నవల సాగుతుంది.
- వందేమాతరం గేయం బెంగాల్ విభజన సందర్భంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో మాతృభూమిని అమ్మవారితో పోల్చారు. బెంగాలీ నవలా సాహిత్య వికాసానికి బంకించంద్ర చేసిన కృషికి ఆయనను 'బెంగాలీ నవలా సాహిత్య పిత'గా పిలుస్తారు.
- నవలలే కాకుండా కమలాకాంత్ దఫ్తర్ అనే వ్యంగ్య నాటకాన్ని కూడా రచించాడు. 1872లో బంగదర్శణ్ అనే మ్యాగజైన్ ప్రచురణను కూడా ప్రారంభించారు. బంకించంద్ర అనంతరం ఈ పత్రిక బాధ్యతలు రవీంద్రనాథ్ ఠాగూర్ తీసుకున్నారు. ఆయన 1894లో మరణించారు.

సంకలనం
హర్షవర్ధన్ చింతలపల్లి